# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

## ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి





### ఇదీ సన్మానపత్రం..!

సృష్టికర్త ఐన 'బ్రహ్మ' ఒక గొప్ప మానవుణ్ణి సృష్టించడానికి కూర్చున్నాడట. ఆయన అర్థాంగి సరస్వతీదేవి వచ్చి 'నాథా! గొప్ప మానవుడంటున్నారు. మరి నా సహాయం అవసరం లేదా?" అని డిగిందట. "లేదు" అన్నాట్ట బ్రహ్మ.

సరే, తరువాత లక్ష్మీదేవి వచ్చింది "సరస్వతి సహాయం వద్దన్నారు. మరి నా సహాయమన్నా అవసరం లేకుండా ఎలా?" అందట.

"నీ సాయమూ అవసరం లేదు" అన్నాడట బ్రహ్మ.. అమె కూడా మొహం ముడుచుకుని వెళ్ళిపోయిందట.

అక్కడ జరుగుతున్న ఈ తతంగం చూసి రతీ మన్మథులు "కనీసం మా సహకారమైనా వద్దా?" అన్నారట.

"అస్సలు అవసరం లేదు.." అన్నాడట బ్రహ్మ స్థిరంగా.

"అయితే ఎలాగండీ! చదువులేకుండా, డబ్బు లేకుండా, కనీసం చూడముచ్చట గొలిపే అందమైనా లేకుండా ఓ గొప్పమనిషిని మీరెలా సృష్టిస్తారు..?" అని వాళ్ళు ఆశ్చర్యంగా అడిగారట.

"వీటన్నింటినీ మించిన మానవత్వం, మమత, నిస్వార్థం, ప్రజాసేవా తత్పరత, కరుణ, ప్రేమ, ఆప్యాయత, అనురాగం - ఈ లక్షణాలన్నింటినీ కలిపి ఈ మూర్తిలో ప్రవేశపెడుతున్నాను అంటూ బ్రహ్మ ఆ మూర్తికి ప్రాణం పోసాడు. ఆ విచిత్రమైన మూర్తే ఈ నాడు ఈ షష్టిపూర్తి వేడుక జరుపుకుంటూ మనమధ్య వున్న మనందరికీ ఆత్మీయుడు "కామరాజ్ నాడార్.."

ఇది కామరాజ్ నాడార్ గారి షష్టిపూర్తి సభలో చదివిన సన్మానపత్రం. దీన్ని రాసింది ప్రముఖ సినీ మాటల రచయిత స్వర్గీయ డి.వి.నరసరాజు !!

### అత్తా ఒకింటి కోడలే..!

### (తీపి గురుతులు- చేదు జ్ఞాపకాలు లో గుమ్మడి)

'ప్రేమించి చూడు' చిత్రం షూటింగ్ హైదరాబాదు సారథీ స్టూడియోలో జరుగుతోంది. హాస్యనటుల్లో ఉన్నత స్థానంలో వున్న రేలంగి గారు, తర్వాత స్థానాల్లో ఉన్న వున్న అల్లు



రామలింగయ్య గారు, నేను ఉన్న సన్నివేశం. కథానుసారం పాత్రల బాంధవ్యాన్ని బట్టి ఆ దృశ్యంలో రామలింగయ్య గారు రేలంగి గార్ని "బావా" అని పిలిచాడు. వెంటనే రేలంగిగారు "ప్రతి అడ్డమైన వాడు నన్ను బావా అని పిలవటమేమిటి" అని అభ్యంతరం పెట్టాడు. రామలింగయ్య గారి ముఖం చిన్నబోయింది. ఇది గమనించిన నేను రేలంగి గారితో " రేలంగి గారూ! అలా అనకండి..మనం పాత్రల పరంగా వ్యవహరించాలే తప్ప ఇలాంటివి వ్యక్తిగతంగా తీసుకోకూడదు. దయచేసి మీ ధోరణి మార్చుకోండి" అని కొంచెం గట్టిగానే చెప్పాను.

రేలంగి గారు ఒక్క క్షణం లోచించి "అంతేనంటారా..?" అన్నారు.

"అవునండీ అంతే.." అన్నాను

హాస్యనటుడు కదా, వెంటనే తనతప్పుని కప్పిపుచ్చుకుంటూ అందరినీ నవ్వుల్లో పెట్టి " మీ అందరి అభిప్రాయం అదే ఐతే..నా అభిప్రాయం అదే." అంటూ సీన్ పూర్తిచేసారు.

కట్ చేస్తే..15 సంవత్సరాల తర్వాత..అదే సారథీ స్టూడియో! అదే ఫ్లోర్ ..చిత్రం పేరు గుర్తురావడంలేదు. రేలంగి గారి స్థానంలోకి అల్లు రామలింగయ్యగారు వచ్చారు. పక్కన మరో చిన్నహాస్యనటుడు వున్నాడు.యాదృఛ్ఛికంగా అటువంటి సన్నివేశమే చిత్రీకరించాల్సి వచ్చింది. దృశ్యంలో నేనూ ఉన్నాను..ఇదీ యాదృఛ్ఛికమే..

ఆ హాస్యనటుడు పాత్ర పరంగా "బావా" అనగానే రామలింగయ్యగారు రియక్ట్ అవుతూ అభ్యంతరం చెప్పారు. ఇదంతా చూస్తున్న నేను "అయ్యా! రామలింగయ్య గారూ..పదిహేను సంవత్సరాల క్రితం ఇక్కడే జరిగిన 'ప్రేమించి చూడు' సంఘటన మీరు మరిచిపోయారా?" అన్నాను. అంతే పాపం ఆయన స్థాణువై పోయాడు..వెంటనే ఆయన మేనరిజమ్‌లో చేతులుపైకెత్తి "అయ్యబాబోయ్..మీరు ఇక్కడే ఉన్నారా" అని తన తప్పుని ఒప్పుకుని సీన్ కొనసాగించారు..

## పాటల పుస్తకాల కబుర్లు



సినిమాలకి 'పాటల పుస్తకాలు' అంటూ రావడం 'సతీసావిత్రి' ( ఈస్టిండియా: 1933) లో మొదలైంది. అప్పుడు దాని ధర ఎంతోగానీ, తర్వాత తర్వాత పాటల పుస్తకం ధర 'కాని' (ఇప్పటి వారికి తెలియాలంటే రూపాయిలో 64 వంతు). కొన్ని సినిమా హాళ్ళలో నేల టిక్కెట్టు ఖరీదు 'అణా' వుండేది (రూపాయిలో పదహారో వంతు). కొన్ని డేరాల్లో ముక్కానీ (మూడు కాసులు, అణాకి నాలుగు కాసులన్నమాట) వుండేది. అణా ఇచ్చి ముక్కానీ టిక్కెట్టు కొంటే , కానీ తిరిగి ఇవ్వాలి. కానీ 'కాని' ఇవ్వకుండా పాటల పుస్తకం చిల్లరగా ఇచ్చేవాళ్ళు.

ఈ పాటల పుస్తకం గురించి ఒక జోక్ కూడా ఉంది. ఆ రోజుల్లో ఓ పల్లెటూరి వాడు టూరింగ్ టాకీస్ కెళ్ళి టిక్కెట్ల రేట్ల గురించి వివరాలు అడిగాడట..

"కుర్చీ అర్థ రూపాయి, బెంచీ నలభై పైసలు, నేల పావలా.." అని కౌంటర్‌లో ఉన్నతను

చెప్పాట్ట.

"అంతకంటే తక్కువలో ఏమీ లేదా..?" అన్నాట్ట అమాయకంగా.

"ఉందయ్యా..పాటల పుస్తకం..ఐదు పైసలు.." విసుగ్గా అన్నాట్ట కౌంటర్ గుమాస్తా..

"బాబ్బాబూ..నాదగ్గర సరిగ్గా ఐదు పైసలే ఉన్నాయి. పాటల పుస్తకమే ఇవ్వండి. దాని మీదే కూర్చుని సినిమా చూస్తాను.." అన్నాడు పల్లెటూరి బైతు..!

## జాతీయసమైక్యత!




'ఆరాధన' పేరుతో ఇంతవరకూ మూడు సినిమాలు వచ్చాయి..(ఇంకా ఎక్కువేమో ..నాకైతే తెలీదు..) మొదటిది 1962 ప్రాంతాల్లో అక్కినేని హీరోగా నటించింది. 1976లో అదే పేరుతో వచ్చిన సినిమాలో హీరో నందమూరి తారకరామారావు. మళ్ళీ 1987లో చిరంజీవి హీరోగా అదే పేరుతో సినిమా వచ్చింది. ఇప్పుడు మనం చెప్పుకోబోయేది ఎన్టీఆర్ 'ఆరాధన' గురించి. అందులో ప్రముఖ హిందీ గాయకుడు మహమ్మద్ రఫీ రామారావు గారికి ఒక నేపథ్యగీతం పాడారు..'నా మది నిన్ను పిలించింది గానమై..వేణు గానమై.." అంటూ. ఆయన తెలుగు ఉచ్చారణ పట్టి పట్టి పలికినట్లుంటూ విచిత్రంగా ఉండేది. ఈ పాట చిత్రీకరణ గురించి అప్పట్లో ఒక రివ్యూలో ఇలా రాసారు.." కులూ మనాలీ లోయల్లో కాశ్మీరీ దుస్తుల్లో ఉన్న ఎన్టీఆర్, మహమ్మద్ రఫీ గొంతుతో తెలుగు పాట పాడుతారు..!' అని. జాతీయ సమైక్యతకిది ఒక ఉదాహరణ కదా..!

## చక్రపాణి చిత్రమర్మం..!





తెలుగు చలన చిత్ర చరిత్రని గుర్తు చేసుకున్నప్పుడు 'చక్రపాణి' అంటే 'మిస్సమ్మ' లాంటి కళాఖండాల్ని సృష్టించిన ప్రముఖ రచయిత చక్రపాణి గారే గుర్తుకు రావడం అతి సహజం.! ఐతే 'చక్రపాణి' పేరుతో 1954లో ఒక సినిమా కూడా వచ్చింది. ఐదే ఈ సినిమాకీ రచయిత చక్రపాణి గారికీ ప్రత్యక్ష సంబంధం లేదుకానీ పరోక్ష సంబంధం ఉంది. ఎలాగంటే - విజయావారి మిస్సమ్మలో కథానాయిక పాత్రకి ముందుగా భానుమతి గారిని తీసుకుని కొంతసేపు షూటింగ్ కూడా జరిపారు. ఐతే ఏవో చిన్న మాటపట్టింపువల్ల ఒక రోజు షూటింగ్‌కి ఆలశ్యంగా రావడంతో భానుమతిగారిని 'మిస్సమ్మ' నుంచీ తొలగించారు చక్రపాణి గారు. అందుకు బాధపడిన భానుమతి గారు ఎలాగైనా ఒక హాస్యచిత్రంలో పాత్రవెయ్యాలని అనుకుని సొంత నిర్మాణంలోనే 'చక్రపాణి' పేరుతో సినిమా నిర్మించి మిస్సమ్మ కంటే ముందుగా 1954 మార్చి 19 న విడుదల చేసారు.. సినిమా టైటిల్ చూస్తే అదేదో హీరో పేరు అనిపిస్తుంది కానీ నిజానికి సినిమాలో అతి పిసినారి పాత్ర వేసిన సి.ఎస్.ఆర్ పాత్ర పేరు 'చక్రపాణి'. ఆ చక్రపాణి గారి మీద కోపంతోనే ఈ చక్రపాణి తీసారని అప్పట్లో అందరూ అనుకునే వారు.

# ఈ గీతము..ఇది ఏ రాగమో..!.

## తిలంగ్ రాగం (హిందుస్తానీ)

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| ఇదియే జీవితానందము | (స్వర్ణమంజరి, ఘంటసాల, ఆదినారాయణ రావు) |
| నా చందమామా | (పాండవవనవాసం, ఘంటసాల, సుశీల ఘంటసాల) |
| నీలకంధరా దేవా | (భూకైలాస్, ఘంటసాల, సుదర్శనం, గోవర్ధనం) |

## బేహాగ్ రాగం

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| వరమొసగే వనమాలీ | (భక్తప్రహ్లాద, డా.బాలమురళీ కృష్ణ, ఎస్.రాజేశ్వరరావు) |
| శ్రీదేవిని నీదు దేవేరిని | (శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం, ఎస్.వరలక్ష్మి, పి.సుశీల, పెండ్యాల) |

## యమన్ రాగం

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| ఎవరివో..నీవెవరివో.. | (పునర్జన్మ, ఘంటసాల, టి.చలపతిరావు) |
| మనసున మల్లెలమాలలూగెనే | (మల్లీశ్వరి, భానుమతి, ఎస్.రాజేశ్వరరావు) |
| పెనుచీకటాయె లోకం మాంగల్యబలం | (ఘంటసాల, సుశీల, మాస్టర్ వేణు) |
| పాలకడలిపై శేషతల్పమున | (చెంచులక్ష్మి, పి.సుశీల, ఎస్.రాజేశ్వరరావు) |

## అంతగా ప్రజాదరణ పొందని సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు



భర్తంటే భార్యకొక రక్షణా పాలన
భార్యంటే భర్తకొక ఆలన లాలన
బంగారు కాపురం (1982)

పరువంలో వేగమంతా ప్రణయంలో రాగమైతే
మనుగడ మధురం కాదా
(బలిదానం 1982)



ఎంతవింత ప్రేమ ఇది
ఎంతమంది బాధ ఇది
సర్వం నీదేనంటుంది
ఆ సర్వం నాదంటుంది
నీవు వుండే వరకు నీ నీడ వుంటుంది
నిన్ను నీకు గురుతు చేస్తూ తరుముతుంటుంది
తరుముకొచ్చే తలపులేవీ తలుపు మూస్తే ఆగవు
మరువలేని మనసులోతును తిరగతోడక మానవు
(ముద్దులమొగుడు 1982)

ప్రేమించుట ఏనాడు కాదమ్మ నేరం
అది నిన్ను కాదంటే ఏంటమ్మ నేస్తం
ప్రేమించి ఓడావు నీ తప్పుకాదు
అది పంచి ఇచ్చేందుకెందరో గలరు
(కోకిలమ్మ 1983)



వెలుగుకు ఉదయం సాయం లేదు
కాలిపోయినా వెలుగై వుంటావు
నివురు మిగిలినా పువ్వైపూస్తావు
వెలుగై - పువ్వై జీవితమర్పించు
ఆ అర్పణలో ప్రతిజీవుడు ఒక సూర్యుడు (గాజుబొమ్మలు 1983) ****